ప్రజాశక్తి

శనివారం 26 ఆగస్టు 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

30 నుంచి సమరభేరి

- విద్యుత్ భారాలు, పన్నుల పెంపుపై సిపిఎం ఆందోళన
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు - ప్రస్తుత రాజకీయ పరిణామాలు సభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 30 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తెలిపారు. గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు - ప్రస్తుత రాజకీయ పరిణామాలు'పై సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం సభ నిర్వహించారు. సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అధ్యక్షత వహించగా బాబూరావు మాట్లాడుతూ ఆగస్టు 30, 31 తేదీల్లో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ, 1, 2 తేదీల్లో గ్రామ, వార్డు సచివాలయాల్లో విజ్ఞాపనలు అందచేయాలని సిపిఎం నిర్ణయించిందన్నారు. 3వ తేదీన నిరుద్యోగ సమస్యలపై రౌండ్‌టేబుల్ సమావేశాలు, 4వ తేదీన మండల కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పేదలకు, పెత్తందారులకు యుద్ధం జరుగుతుందని సిఎం జగన్ అంటున్నారని వాస్తవంగా అసలైన పెత్తందారులకు జగన్ కొమ్ముకాస్తున్నారని అన్నారు. దేశంలో అత్యంత పెద్దపెత్తందారులైన ఆదాని, అంబానికి మద్దతిస్తున్న మోడీ బాటలో నడుస్తున్న జగన్ ప్రభుత్వం కూడా అదేబాటలో పయనిస్తోందన్నారు. నాలుగేళ్లగా ఇసుక విధానం గందరగోళంగా మార్చేసి నిర్మాణ

2లో



సభలో మాట్లాడుతున్న సిహెచ్.బాబూరావు

బిజెపి పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

బిజెపి పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. గుంటూరు సభలో ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం చేసే అరాచకాలను ప్రశ్నించే మేధావులు, ప్రజాస్వామ్య వాదులు, కవులు, మీడియా వారి గొంతు నొక్కడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్, సిబిఐ ద్వారా దాడులు చేయిస్తున్నారని అన్నారు. ప్రతిపక్ష పార్టీల్లోనే అవినీతి పరులున్నారా? అని ప్రశ్నించారు. బిజెపిలో ఎంతో మంది అవినీతి పరులున్నా ఈడి, సిబిఐ వారి జోలికివెళ్లడం లేదన్నారు. బిజెపికి మద్దతిచ్చే పార్టీల నాయకులు అవినీతికి పాల్పడినా వారిని పట్టించుకోరని, కేవలం తమకు వ్యతిరేకంగా ఉన్న ప్రతిపక్షాలను లక్ష్యం చేసుకుని రాజ్యాంగ వ్యవస్థను బిజెపి ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. ప్రతిపక్షాల ప్రశ్నలకు జవాబులు చెప్పకుండా పార్లమెంటు జరగకుండా చేయడానికి

2లో



5లో

ప్రారంభ కార్యక్రమంలో బివి రాఘవులు, లక్ష్మణరావు, రత్తయ్య తదితరులు

ధన రాజకీయాలు ఎల్లకాలం ఉండవు

- హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం చైర్మన్ బి.వి.రాఘవులు
- ఘనంగా తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవం



దేహదారుఢ్య పరీక్షల ట్రైల్‌రన్‌ను పరిశీలిస్తున్న డిఐజి పాల్‌రాజ్, గుంటూరు ఎస్పీ అరిఫ్ హఫీజ్

ఎస్ఐ అభ్యర్థులకు నేటి నుంచి దేహదారుఢ్య పరీక్షలు

ఏర్పాట్లను పరిశీలించిన డిఐజి పాల్‌రాజ్

8 లో

మైనింగ్ ఆపి ఎస్టీలకు పట్టాలివ్వండి

తహశీల్దార్, ఎస్ఐకు సిపిఎం వినతి

4 లో

ఉపాధ్యాయులను కించపరచటం తగదు

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

3 లో

రైతుల బంగారం ఏమైందో నిగ్గు తేల్చండి

- నీటి విడుదలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి
- భవన నిర్మాణ కార్మికుల క్లెయిములు, మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి
- ప్రజా సమస్యలపై 30వ తేదీ నుండి ప్రచార ఆందోళనలు
- సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

వ్యవసాయ అవసరాల కోసం రైతులు బ్యాంకుల్లో తనఖా పెట్టిన బంగారం ఏమైందో బ్యాంక్ అధికారులు, ప్రభుత్వం నిగ్గు తేల్చాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. క్రోసూరు, అచ్చంపేట మండలాల్లోని బ్యాంకుల్లో రైతులు తనఖా పెట్టిన బంగారాన్ని అప్రయిజర్లు, మేనేజర్లు కుమ్మక్కై కాజేశారని

2లో



మాట్లాడుతున్న గుంటూరు విజయ్‌కుమార్



సభలో మాట్లాడుతున్న పాశం రామారావు

30 నుంచి సమరభేరి

(మొదటి పేజీ తరువాయి)

రంగాన్ని దెబ్బకొట్టారని విమర్శించారు. రాష్ట్రంలో నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చిన బిజెపికి మూడు ప్రాంతీయ పార్టీలు మద్దతు పలకడం దారుణమన్నారు. మోడీ విజన్ బాగుందని చంద్రబాబు అనడం సిగ్గుచేటన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, ప్రత్యేక హోదా ఇవ్వకపోయినా మోడీ చంద్రబాబుకు ఎలా నచ్చుతారని ప్రశ్నించారు. ఢిల్లీని తలదన్నే రాజధాని నిర్మిస్తామని చెప్పిన మోడీ ఇప్పుడు ఎందుకు నిధులివ్వడం లేదని ప్రశ్నించారు. 2 వేల ఎకరాల్లో రాజధానిని నిర్మిస్తే సరిపోయే దానికి అవసరానికి మించి భూములు తీసుకుని ఎటూ కాకుండా చేశారని అన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రజలపై పన్నుల భారం మోపుతోందని, మోడీ ఆదేశాలను ముందే అమలు చేస్తూ సిఎం జగన్ ఆదాని, అంబానికి ఉపయోగపడేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. పన్నుల భారం మోపడంలో మోడీ, జగన్ జాయింట్ వెంచర్ అని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్యులు అల్లాడుతున్నారని అన్నారు.

ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ఈశాన్య రాష్ట్రాల్లో మైనార్టీలను దెబ్బతీసేందుకు బిజెపి ప్రయత్నిస్తోందన్నారు. ఆర్ఎస్ఎస్ ఎజెండా అమలుకు బిజెపి ప్రాధాన్యమిస్తోందని, ఉత్తర ప్రదేశ్‌లో 24 శాతంమంది ముస్లిములు ఉండగా వారికి ఒక్కసీటూ ఇవ్వలేదని చెప్పారు. జమ్ముకాశ్మీర్‌లో స్వయం ప్రతిపత్తిని రద్దు చేశారని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు ద్వారా జమ్మూకాశ్మీర్‌ను రాష్ట్రంగా కాకుండా కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చారని అన్నారు.

పాశం రామారావు మాట్లాడుతూ బిజెపిపాలనలో నిత్యావసర వస్తువులు, పెట్రోలు, డీజిలు, గ్యాస్‌ధరలు విపరీతంగా పెంచారన్నారు. దేశంలో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని అన్నారు. రాష్ట్రంలో ఇసుక సమస్యల వల్ల భవన నిర్మాణ కార్మికులకు నెలలో 20 రోజులు కూడా పని దొరకడం లేదని, అసంఘటితరంగ కార్మికులకు పనులు దొరకడం లేదని తెలిపారు. నిరుద్యోగం పెరిగిందని, ప్రభుత్వ రంగ సంస్థలను దెబ్బతీస్తున్నారని అన్నారు. మనువాద రాజ్యాంగం అమలుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాజధానికి, పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వకపోయినా కేంద్రంలో బిజెపికి టిడిపి, వైసిపి, జనసేన మద్దతు పలుకుతుండటం దారుణమన్నారు. కేంద్రం రాష్ట్రానికి అన్యాయం చేసినా మూడు పార్టీలు మాట్లాడవని అన్నారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.భావన్నారాయణ, వై.నేతాజి, ఇ.అప్పారావు, ఎం.రవి, ఎస్ఎస్. చెంగయ్య, నళినీకాంత్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ నేత్రదాన ప్రతిజ్ఞ చేయాలి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : ప్రతి ఒక్కరూ నేత్ర దాన ప్రతిజ్ఞ చేయాలని ఎల్‌వి ప్రసాద్ నేత్ర విజ్ఞాన సంస్థ వైద్యులు డాక్టర్ అరవింద్ రాయ్ అన్నారు. నేత్రదాన అవగా హనా కార్యక్రమం తాడి గడపలోని ఆస్పత్రి ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 10 మిలియన్ అంధులలో 2 మిలియన్ మంది కార్నియల్ అంధత్వం బారిన పడుతున్నారన్నారు. ఇందులో 60 శాతం మంది 12 ఏళ్ల వయసులోపు వారు ఉన్నారని వీరు కార్నియా సంబంధిత వ్యాధి, గాయం లేదా ఇన్ఫెక్షన్ కారణంగా రావచ్చని తెలిపారు. కంటి సమస్యలకు సంబంధించి కార్నియా మార్పిడి మాత్రమే తెలిసిన చికిత్స అని దీనికి గణనీయమైన సంఖ్యలో నేత్రదానం అవసరం అన్నారు. కానీ నేత్రదాన సంబంధిత అపోహలు భయాలతో పాటు అవగాహన లేకపోవడం వలన నేత్రదానం చేసే వారి సంఖ్య చాలా తక్కువగా ఉందన్నారు.



జాతీయ రహదారులపై జరిగిన సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

జాతీయ రహదారులపై ప్రత్యేక దృష్టి

- నోవాటెల్ నుండి నిడమానూరు వరకు ఫ్లైఓవర్ నిర్మాణం
- మంత్రి జోగి, ఎంపి బాలిశౌరి వెల్లడి

ప్రజాశక్తి - విజయవాడ

జిల్లాలో జాతీయ రహదారులను పూర్తి స్థాయిలో అభివద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటు న్నామని రాష్ట్ర గహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి తెలిపారు. విజయవాడ నగరంలో నోవాటెల్ హోటల్ నుండి నిడమానూరు వరకూ ఫ్లై ఓవర్ నిర్మాణానికి డిపిఆర్ పూర్తయిందన్నారు. పామర్రు - చల్లపల్లి రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా విలీనం చేసేందుకు చర్యలు తీసుకుంటు న్నామని చెప్పారు. కష్ణా నదిపై వంతెన నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో జాతీయ రహదారుల అభివద్ధికి చేపట్టాల్సిన పనుల ప్రగతిపై ఆయా జిల్లాలకు చెందిన శాసనసభ్యులు, జాతీయ రహదారుల అధికారులు, వివిధ శాఖల అధికారులతో శుక్రవారం నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం మంత్రి జోగి రమేష్, ఎంపి బాలశౌరి మీడియాతో మాట్లాడుతూ జాతీయ రహదారి 65 పరిధిలోని విజయవాడ - మచిలీపట్నం నాలుగు లైన్ల జాతీయ రహదారి అభివద్ధిపై చర్చించినట్లు చెప్పారు. వచ్చే రెండేళ్లలో బందరు పోర్టు పూర్తి కానున్న నేపథ్యంలో విజయవాడ - మచిలీపట్నం

జాతీయ రహదారులపై ప్రత్యేక దృష్టి

జాతీయ రహదారికి అత్యంత ప్రాధాన్యత ఏర్పడుతుందన్నారు. ఈ రహదారిలో ఉన్న లోపాలను సరిదిద్ది అవసరమైన చోట్ల అండర్ పాస్ నిర్మాణాలను పూర్తి చేయాలని, కంకిపాడు - పామర్రు ప్రాంతంలో లైటింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరామన్నారు. జాతీయ రహదారి 16లో ఫేజ్ - 3, ఫేజ్ - 4 లలో ఎదురయ్యే సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలను సూచించామన్నారు. హైదరాబాద్ - గుంటూరు జాతీయ రహదారిని కలుపుతూ కష్ణానదిపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు దాదాపు 60 శాతానికిపైగా పూర్తయ్యాయని తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని సూచించామన్నారు. విజయవాడ నుండి గన్నవరం జాతీయ రహదారివైపు నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తున్న నేపథ్యంలో విజయవాడ నోవాటెల్ హోటల్ నుండి నిడమానూరు వరకూ ఫ్లైఓవర్‌ను నిర్మించడం ద్వారా ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో నేషనల్ హై వే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు నారాయణరెడ్డి, శ్రీనివాసరావు, జి.దుర్గాప్రసాద్, జి.పద్మ, శాసనసభ్యులు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, కొలుసు పార్థసారధి, వసంత కష్ణ ప్రసాద్, అనిల్ కుమార్, సింహాద్రి రమేష్ బాబు, ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల కలెక్టర్లు ఎస్.డిల్లీ రావు, పి.రాజాబాబు, జాయింట్ కలెక్టర్లు పి.సంపత్ కుమార్, డాక్టర్ అపరాజితా సింగ్, విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్, డిఆర్ఒ కె.మోహన్ కుమార్, రెండు జిల్లాలకు చెందిన ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యూఎస్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విఆర్‌ఎలపై నిర్బంధం తగదు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు దాటినా విఆర్‌ఎలకు ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చకపోగా, సమస్యలు పరిష్కరించమని ఆందోళన చేస్తున్న విఆర్‌ఎలపై తీవ్ర నిబంధం ప్రయోగించి, ఎక్కడికక్కడ అరెస్టులు చేయటం సరికాదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే విఆర్‌ఎలకు రూ.15వేలు వేతనం, నామినాలను విఆర్‌ఎలుగా నియమిస్తామని, అనేక వాగ్ధానాలు ఇచ్చి ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. నాలుగేళ్లు ఎదురు చూసి, హామీలు అమలు చేయాలని కోరినందుకు విఆర్‌ఎలపై నిర్బంధం ప్రయోగించటం తగదని పేర్కొన్నారు. అంతే కాకుండా దశాబ్దాలుగా వారు పొందుతున్న డిఎను నిలిపివేశారని, విఆర్ఒగా ప్రమోషన్‌కు గతంలో ఉన్న ఇంటర్ అర్హతను ఇప్పుడు డిగ్రీకి పెంచి, అనేక మందికి ప్రమోషన్‌కు అవకాశం లేకుండా చేశారని, అటెండర్లు, వాచ్‌మెన్ల పోస్టులు పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉన్నా, విఆర్‌ఎలకు పదోన్నతి ఇవ్వకుండా, చట్టవిరుద్ధంగా విఆర్‌ఎలతో అటెండర్, వాచ్‌మెన్ డ్యూటీలు చేయిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో పనిచేయాల్సిన విఆర్‌ఎలతో తహశీల్దారు కార్యాలయాల్లో పనిచేయిస్తున్నారని విమర్శించారు. అరెస్టు చేసిన విఆర్‌ఎలను తక్షణమే విడుదల చేయాలని, యూనియన్‌తో చర్చించి, సమస్యలు పరిష్కరించాలని నేతాజి డిమాండ్ చేశారు.

బిజెపి పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

(మొదటి పేజీ తరువాయి)

బిజెపియే కుట్ర పన్నుతోందన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంటు సమావేశంలో మణిపూర్ ఘటనలు, అంతకుముందు జరిగిన సమావేశాల్లో పెగాసస్ అంశాలపై సమాధానం చెప్పకుండా ప్రభుత్వం పలాయనవాదం అవలంబించిందన్నారు. కేవలం తమకు అనుకూలమైన బిల్లుల ఆమోదం కోసమే పార్లమెంటులో బిల్లులు ప్రవేశపెడుతుందన్నారు. అదానిని రక్షించేందుకు పెగాసస్ అంశంపై ఇంతవరకు దర్యాప్తు పూర్తి చేయలేదని ఈనెల 31లోగా దర్యాప్తు పూర్తి చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయాన్ని రాఘవులు గుర్తు చేశారు. మణిపూర్ ఘటనల్లో రెండు జాతుల మధ్య ఏర్పడిన ఘర్షణకు ఒక పరిష్కారం చూపకుండా ప్రధాని మోడీ కాలయాపన చేస్తున్నారని అన్నారు. మణిపూర్ ఘటనలో ఇప్పటివరకు 190 మంది మృతి చెందారని, పోలీసు స్టేషన్‌లో 4 వేల తుపాకులు తీసుకువెళ్లారని ప్రభుత్వ మద్దతు లేకుండా తుపాకులు తీసుకువెళ్లగలరా? అని ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉన్నచోట రెండుజాతుల మధ్య ఘర్షణలు జరిగి మహిలను వివస్త్రలను చేసిన ఘటనలపై ప్రధాని స్పందన చాలా దారుణంగా ఉందన్నారు. రాజ్యాంగంలోకి లౌకిక వాదాన్ని బిజెపి నాశనం చేస్తోందని, రాష్ట్రాల హక్కులపై దాడి జరుగుతున్నా వైపిపి ఎంపిలు నిసిగ్గుగా బిజెపికి మద్దతు పలుకుతున్నారని విమర్శించారు. ఢిల్లీలో ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల బదిలీ, నియామకాలను కేంద్రం పరిధిలోకి మార్చారని, ఇది సమాఖ్య స్ఫూర్తిపై తీవ్ర దాడి అని అభివర్ణించారు. పారిశ్రామిక వేత్తలు బకాయిలు రూ.17 లక్షల కోట్ల వరకున్నా కేంద్రం వారిపై చర్యలు తీసుకోదని, సామాన్యుల రుణాలపై మాత్రం ఉక్కుపాదం మోపుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యం పరిరక్షణ, రాజ్యాంగ రక్షణ కోసం 26 పార్టీలతో 'ఇండియా' కూటమి ఆవిర్భవించిందన్నారు.

రైతుల బంగారం ఏమైందో నిగ్గు తేల్చండి

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. బంగారం ధర రోజురోజుకూ పెరుగుతున్నా రైతులకు మాత్రం సాధారణ ధరలే వర్తింపజేశారని అన్నారు. బాధిత రైతులకు న్యాయం చేయకుంటే ఉద్యమిస్తామన్నారు. పల్నాడు జిల్లాలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఏ పంటలు సాగు చేయాలో ప్రభుత్వం రైతులకు సూచించాలని, నీరెప్పుడు సరఫరా చేస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాకు చెందిన జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు జులై 17న సాగునీరు సాగునీటి విడుదల చేస్తామని చెప్పినా చేయలేదని, నీటి విడుదలపై ఇప్పటికైనా స్పష్టమైన విధి విధానాలు ప్రకటించాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నుండి రూ.1600 కోట్లను ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించిందని, వాటిని వెంటనే బోర్డుకు జమ చేయాలని డిమాండ్ చేశారు. అందుకు అడ్డంకిగా ఉన్న జీవో 1214ను వెంటనే రద్దు చేయాలన్నారు. సంక్షేమ బోర్డు నిధులంటే కార్మికులు కష్టపడి రూపాయి రూపాయి పోగు చేసి దాచుకున్నవనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. పల్నాడు జిల్లాకు సంబంధించి రూ.7.55 కోట్ల క్లెయిములను పెండింగ్‌లో పెట్టారని, వాటిని పరిష్కరించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు నెలకుపైగా ఆందోళన చేస్తున్నారని, అయినా నాయకులతో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని విమర్శించారు. సమస్యలను ఇప్పటికైనా పరిష్కరించాలని, హామీలను అమలు చేయలేకుంటే ఎందుకు చేయలేరో వివరణివ్వాలని డిమాండ్ చేశారు. సాధ్యపడే హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. మొన్నటి వరకు టమాట ధర ఆకాశాన్ని తాకితే ప్రస్తుతం ఉల్లి ధర పెరుగుతోందని, ధరల స్థిరీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరం చర్యలు చేపట్టాలన్నారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, వివిధ రకాల ఛార్జీలు ప్రజలకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు తెచ్చిపెడుతున్నారని, ఈ నేపథ్యంలో ప్రజల సమస్యలపై ఈనెల 30వ తేదీ నుండి వచ్చేనెల 6వ తేదీ వరకు సిపిఎం ఆధ్వర్యంలో గ్రామగ్రామాన ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు విజయ్‌కుమార్ ప్రకటించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా సచివాలయాల వద్ద నిరసనలు, అధికారులకు వినతిపత్రాలు ఇస్తామని, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పరిశోధనలకు మరిన్ని నిధులివ్వాలి

చంద్రయాన్-3 విజయవంతం ద్వారా దేశ ఖ్యాతిని ఇస్రో శాస్త్రవేత్తలు ప్రపంచవ్యాప్తంగా మరింతగా విస్తరింపజేశారని విజయ్‌కుమార్ అన్నారు. శాస్త్రవేత్తలకు సిపిఎం పల్నాడు జిల్లా కమిటీ తరఫున ప్రత్యేక అభినందనలు తెలిపారు. పరిశోధనలు తీసుకెళ్లడానికి మరిన్ని నిధులను సమకూర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయ నాయక్, నాయకులు జి.మల్లీశ్వరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-పెదకాకాని

నంబూరు గ్రామ పరిధిలోని హైవేపై శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. గుంటూరు వైపు నుంచి విజయవాడ వెళుతున్న ఆటోను వెనుక నుంచి అతివేగంగా వస్తున్న కారు ఢీ కొట్టడంతో ఒక మహిళ మృతి చెందింది. మృతురాలి వయసు సుమారు 35 సంవత్సరాలు ఉంటుంది. పెదకాకాని పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఈ ఘటనలో గాయ పడ్డ వారిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఒరిస్సా వాసి మృతి

ప్రజాశక్తి-నాదెండ్ల

ద్విచక్రవాహనంపై అతివేగంగా వచ్చి గోడకు ఢీ కొట్టిన ఘటనలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గణపవరం ఐసిఎం కంపెనీ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. నాదెండ్ల ఎస్సై బలరాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఒరిస్సాకి చెందిన కనై దాస్ (35) సిఆర్ కాలేజీ సమీపంలో ఉన్న ఓ పాత ఇనుప దుకాణంలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై అతివేగంగా వచ్చి సడన్ బ్రేక్ కొట్టడంతో పక్కనే ఉన్న రమ్య స్పిన్నింగ్ మిల్లు గోడను ఢీ కొట్టి.. అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య ఈ మధ్యకాలంలోనే చనిపోయింది. అతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారిద్దరూ ఒరిస్సాలోనే ఉన్నారు. ఈ సంఘటనపై ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - మాచర్ల

మండలంలోని కంభంపాడు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మిరియాల చిన్న మాణిక్యం, పొన్నాల తేజాలకు తీవ్రగాయాలయ్యాయి. ఇద్దరు ద్విచక్ర వాహనంపై మాచర్ల నుండి కంభంపాడు వైపు వెళుతుండగా వెనుకగా వస్తున్న కారు వారి వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో, కింద పడిపోయిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి .108 వాహనంలో మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వీరిని నరసరావుపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాద ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





నంబూరు పరిధిలోని హైవేపై ఆటోను ఢీ కొట్టిన కారు, మహిళ మృతదేహం





గణపవరంలో గోడను ఢీ కొట్టిన బైక్, మృతుడు కనైదాస్

మండీలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి - మాచర్ల



స్థానిక ఆర్టీసీ బస్సు డిపో సమీపంలోని మేకల మండిలో గుర్తుతెలియనివ్యక్తి మృతి చెందాడు. గురు వారం రాత్రి పది గంటల సమయంలో స్థానికులు, పట్టణ పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు వారు అక్కడికి వెళ్లి పరిశీలించారు. మండిలో చెట్టు కింద మధ్య వయసులో ఉన్న వ్యక్తి మృతదేహం ఉంది. డ్రాయర్ మాత్రమే ధరించి ఉన్నాడు. అతను యాచకుడు అని తెలుస్తోందని పోలీసులు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు_న్నారు.

ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా చూసుకోవాలి

ప్రజాశక్తి-తెనాలి



అంగలకుదురులో దుకాణదారులతో మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్లు

ట్రాఫిక్ కు, పాదచారులకు ఇబ్బంది లేకుండా వ్యాపారస్తులు జాగ్రత్తలు తీసు కోవాలని రూరల్ ఎస్సై సిహెచ్ వెంకటేశ్వర్లు చెప్పారు. రూరల్ గ్రామం అంగలకుదురులో శుక్రవారం ఆయన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా రోడ్డుకి ఇరువైపులా ఉన్న వ్యాపార కూడళ్ళ ముందు నిలిపి ఉంచిన వాహనాలను క్రమ బద్ధీకరించారు. అలాగే పాదచారులు నడిచేందుకు వీలుగా వాహనాలను తొలగించారు. ఈ సందర్భంగా స్థానిక వ్యాపారులతో ఆయన మాట్లాడారు. కేవలం వ్యాపార దక్పథమే కాకుండా, ప్రజలకు ఇబ్బంది లేకుండా కూడా జాగ్రత్తలు తీసుకోవాలని వారికి వివరించారు. వాహనాల నిలుపుదలలో దుకాణదారులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట పలువురు సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

మూడు వార్డుల్లో ముగిసిన 'భవిష్యత్తుకు గ్యారంటీ'

ప్రజాశక్తి-తెనాలి

తెలుగుదేశం పార్టీ రూపొందించిన మినీ మేనిఫెస్టో వివరించేందుకు భవిష్యత్తుకు గ్యారంటీ పేరిట పట్టణంలోని 12, 13, 15 వార్డులలో చేప ట్టిన కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది . ముగింపు సందర్భంగా నిర్వహించిన సభలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. నాలుగేళ్ల వైసిపి పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. పన్నులు, అధిక ధరలు, విద్యుత్ ఛార్జీల మోత వంటి అనేక సమస్యలతో సామాన్యులు ఇబ్బందులకు గురయ్యారన్నారు. వారిలో భరోసా నింపేందుకే టిడిపి మేనిఫెస్టో విడుదల చేసిందన్నారు. పేదల సంక్షేమాన్ని కోరు కునేది టిడిపి ఒకటేనని స్పష్టం చేశారు. రానున్న ఎన్ని కలలో వైసిపికి చరమగీతం పాడాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు టీ హరిప్రసాద్, గిరి గణేష్ బి మోహన్ రావు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక గీతాంజలి స్కూల్స్‌లో వరలక్ష్మి వ్రత వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో వరలక్ష్మి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.కృష్ణవేణి మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ సంప్రదాయాలపై ఈ తరం విద్యార్థులు పూర్తిగా అవగాహనా లోపంతో వున్నారని అన్నారు. పాశ్చాత్య సంస్కృతి మోజులో వీటిని మర్చి పోతున్నారని, వారిని తిరిగి మన సంస్కృతి వైపునకు తీసుకురావాలనే సదుద్దేశంతో అన్ని పండుగలు పిల్లలకు అర్థ మయ్యేలా పాఠశాల ఆవరణలో జరుపుతున్నట్లు చెప్పారు. అనంతరం చిన్నారులో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్య క్రమాలు ఆకట్టుకున్నాయి.

వివాహితకు వేధింపులు

ప్రజాశక్తి-తెనాలి

ఓ వివాహితను తరచుగా వేధిస్తున్న వ్యక్తిపై పట్టణ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం స్థానిక ముత్తెంశెట్టివారి పాలెంకు చెందిన వివాహితను, అదే ప్రాంతానికి చెందిన శ్రీనివాసరావు ఫోన్ చేసి వేధిస్తున్నాడు. అతని వేధింపులు తాళలేక బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	: 23,451
మిర్చి ఎగుమతి	: 26,738
మిర్చి నిల్వ	: 9,295

మిర్చి ధరలు

రూపాయలలో

334	9,000 - 23,500
నెం.5	9,000 - 19,000
273	16,000 - 18,000
341	10,500 - 23,000
సూపర్ 10	20,500 - 20,500
నాన్ ఏసి	
తేజ	10,000 - 24,200
బడిగి	10,000 - 26,500
దేవనూరు డీలక్స్	15,000 - 20,500
తాలుకాయలు	5,000 -14,500
ఏసి	
334	15,000 - 21,000
341	12,500 - 21,000
4884	19,500 - 22,000
తేజ	10,000 - 24,200
బడిగి	14,000 - 26,000
తాలుకాయలు	5,000 -13,000

మైనింగ్ ఆపి ఎస్టీలకు పట్టాలివ్వండి

ప్రజాశక్తి - నకరికల్లు

తహశీల్దార్, ఎస్ఐకు సిపిఎం వినతి

ఎస్టీలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్‌కు ఎస్టీలతో కలిసి నాయకులు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ చేజర్లలో సుబ్బయ్యకుంటలో 40 ఏళ్ల నుండి ఎస్టీలు సాగు చేసుకుంటున్న భూముల్లో 49 ఎకరాలను 2014లో గ్రామానికి చెందిన కాసా వెంకట్రావుకు మైనింగ్ కోసం 2034 వరకు అనుమతిచ్చారని తెలిపారు. ప్రస్తుతం ఆ భూముల్లో మైనింగ్ చేపట్టడంతో ఇతర పొలాలకు ఇబ్బందిగా మారిందని, మైనింగ్ పనులను సత్వరమే నిలిపేయాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ మేరకు తహశీల్దార్ నగేష్, ఎస్ఐ బాలకృష్ణ యాదవ్‌కు వినతిపత్రాలు ఇచ్చారు. ఇదే విషయాన్ని వైసిపి మండల కన్వీనర్ బి.రాఘవరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తహశీల్దార్ మాట్లాడుతూ మైనింగ్‌కు ఇచ్చిన ప్రాంతాన్ని, ఎస్టీల భూములను పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి జి.పిచ్చారావు, అప్పిరెడ్డి, ఎస్.రామాంజి నాయక్, కొండ నాయక్, దుర్గాబాయి, భారతిభాయి, గౌరీ బాయి ఉన్నారు.





విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

నిరూపిస్తే యావదాస్తి ఇచ్చేస్తా

వాస్తవాలను పాదయాత్ర ద్వారా ఇంటింటికీ తిరిగి

చెబుతా : ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ప్రజాశక్తి - వినుకొండ

జాలలపాలెం వద్ద 175 ఎకరాల ప్రభుత్వ భూములను తాను ఆక్రమించినట్లు వస్తున్న ఆరోపణలను నిరూపించినా, తన భూముల్లో సెంటు భూమి అయినా ప్రభుత్వానికి ఉన్నా తన యావదాస్తి ఇచ్చేస్తానని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సవాల్ విసిరారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. శ్రీవత్స ఫుట్‌పార్క్ లిమిటెడ్ పేరుపై అటవీ భూములు లేవని గతంలో అటవీ శాఖ నివేదించిదని అన్నారు. హైకోర్టు జడ్జిమెంట్‌ను చదవకుండానే టిడిపి నాయకులు వర్ల రామయ్య తప్పుడు ఫిర్యాదు చేశారని వ్యక్తిగతంగా తీవ్ర విమర్శలు చేశారు. మాజీ ఎమ్మెల్యే జివి ఆంజనేయులు కావాలనే తనపై తప్పుడు ప్రచారాలు చేయిస్తున్నారని అన్నారు. ఉప్పలపాడు, కొప్పుకొండ, ముప్పాళ్ల, ఖమ్మంపాడు, తదితర గ్రామాల్లో టిడిపి నాయకులు వారి కుటుంబ సభ్యుల పేరుపై భూములను ఆక్రమించారంటూ రికార్డులను చూపారు. ప్రభుత్వ భూములు మలుపురి ఆగ్రోటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌పై ఉన్నాయని, తనకున్న 200 ఎకరాల్లో 120 ఎకరాలు జగనన్న కాలనీకి ప్రభుత్వానికి అమ్మానని, మిగతా 80 ఎకరాల్లో 30 ఎకరాలు డైరీ ఫార్మ్, మరో 50 ఎకరాలు కౌ ఫామ్ పెడుతున్నట్లు వివరించారు. ఈ వాస్తవాలను పాదయాత్ర ద్వారా ఇంటింటికీ తిరిగి ప్రజలకు చెబుతానన్నారు.

చిక్కీలు అమ్ముకుంటున్నవ వారిని తొలగించండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - దాచేపల్లి

మండలంలోని తక్కెళ్లపాడు వద్దనున్న కస్తూరిబాయి బాలికల పాఠశాలలో విద్యార్థినులకు అందించాల్సిన చిక్కీలను బయట అమ్ముకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి కె.సాయికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. చాలాకాలంగా జరుగుతున్న ఈ తతంగాన్ని మీడియా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుందని, పిల్లలకు అందించాల్సిన పౌష్టికాహారాన్ని దొంగచాటుగా అమ్ముకోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. దీనిపై విద్యాశాఖాధికారులు సత్వరమే విచారణ చేయాలని, బాధ్యులను విధుల నుండి తొలగించాలని కోరారు.

రికార్డుల్లోనే తైవాన్ జామతోటలు

సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెలుగులోకి - రూ.33 వేల రికవరీకి పీడీ ఆదేశం

ప్రజాశక్తి-ఈపూరు



ఏపీఓ లక్ష్మణ్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పిడి జి జోసెఫ్ కుమార్

ఉపాధి హామీ పనుల పర్యవేక్షణలో ఏపీవో నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల డ్వామా పీడీ జి.జోసెఫ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎస్ఆర్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2022-23కు సంబంధించి 515 ఉపాధి హామీ, నిర్మాణ పనులకు రూ.5,86,29,171 ఖర్చు చేశామని చెప్పారు. డీఆర్పీలు ఆయా గ్రామ పంచాయతీలలో సామాజిక తనిఖీలలో గుర్తించిన అంశాలను ప్రజా వేదికలో చదివి వినిపించారు. పనుల వివరాలను రికార్డులలో నమోదు చేయడంలో నిర్లక్ష్యాన్ని గుర్తించిన పీడీ వారం రోజుల్లో ఆయా వివరాలను రికార్డులలో నమోదు చేయకుంటే జరిమానా వేస్తామని హెచ్చరించారు. కొచ్చర్లలో ఇద్దరు, ఊడిజెర్లలో రైతులు తైవాన్ జామ తోట సాగు చేసినట్లు రికార్డులో ఉండగా ఆ ప్రదేశంలో తోటలు లేవన్నారు. క్షేత్రస్థాయిలో తోటల సాగుపై పరిశీలించాలని ఏపీడి ఈపూరి బూసిరెడ్డిని ఆదేశించారు. ఎ.ముప్పాళ్ల సచివాలయ భవన నిర్మాణానికి రూ.45 లక్షలు ఖర్చు చేయాల్సి ఉండంగా అదనంగా పంచాయతీ ఖాతాకు రూ.27 వేలు జమ చేయడంపై వీఆర్ఏ ముత్తినేని శ్రీనివాసరావును ప్రశ్నించారు. వనికుంట, ఊడిజర్ల గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు పనిలో లేనప్పుడు వారిని ఎందుకు తొలగించలేదని, కొత్తవారి నియామకం కోసం ప్రతిపాదనలు ఎందుకు పంపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం అనంతరం రూ.33 వేలు రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏవి రంగనాయకులు, జెడ్‌పిటిసి టి.చౌడయ్య, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ విజయకుమారి, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'20 కేసుల్లో నిందితుడైన విజయసాయిరెడ్డా చంద్రబాబును విమర్శించేది'

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



ఇరవై కేసుల్లో నిందితుడైన విజయసాయిరెడ్డి మాజీ సిఎం చంద్రబాబు, లోకేష్‌ను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్ అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని అరండల్‌పేటలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబంపై వచ్చిన అవినీతి ఆరోపణలన్నీ విజయసాయిరెడ్డి వల్లేనన్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు పారిశ్రామిక వేత్తల వద్ద నుండి తీసుకున్న లంచం డబ్బుతోనే భారతి సిమెంట్, సాక్షి మీడియా, ఇతర పరిశ్రమలను ఏర్పాటు చేశారని ఆరోపించారు. 14 ఏళ్ల సిఎంగా ఉన్న చంద్రబాబు ముందు చూపుతో నాడు విజన్-2020 ద్వారా ఐటి రంగంలో యువత ఉన్నతంగా స్థిరపడ్డానికి కారణమయ్యారని చెప్పారు. ప్రతి గ్రామంలో 60 శాతం మంది రైతు కుటుంబంలో వారి పిల్లలు ఉద్యోగాలు చేస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసి ప్రపంచ పటంలో నిలిపిన వ్యక్తి చంద్రబాబన్నారు. అదేరీతిలో నేడు విజన్-2047ను ప్రకటించారన్నారు. అలాంటి వ్యక్తిపై వైసిపి మంత్రులు ఎంపీలు, ఎమ్మెల్యేలు పదే పదే ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. ప్రపంచంలో ఉన్న సాంకేతికతను ఆంధ్ర రాష్ట్రానికి పరిచయం చేసిన వ్యక్తి చంద్రబాబు అని, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయలేని అసమర్థ ప్రభుత్వం వైసిపి అని విమర్శించారు. పోలవరం పూర్తి చేసి ఉంటే రాష్ట్రం సస్యశ్యామలం అయ్యేదన్నారు. పోలవరంపై తెలంగాణ రాష్ట్రానికి సంబంధం లేకుండా తెలంగాణకు చెందిన 7 మండలాలను ముందు చూపుతో ఆంధ్ర కలపడంతో పాటు ప్రపంచంలో ఎక్కడా జరగని నదుల అనుసంధానం గుర్తించి దూరదృష్టితో ఆలోచించడమే కాకుండా తన ఆలోచనలు రాష్ట్ర ప్రజలకు తెలిపారన్నారు.



మంత్రులకు సామూహిక రాయబారానికి తరలిరండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని కోరుతూ పల్నాడు జిల్లాలోని మంత్రులకు విన్నవించేందుకు తలపెట్టిన సామూహిక రాయబార కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మికులు తరలిరావాలని భవన నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎ.ప్రసాదరావు పిలుపిచ్చారు. పట్టణంలోని లక్కరాజుగార్లపాడు సెంటర్లో శుక్రవారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో 30 ఏళ్లు పోరాడి సాధించుకున్న నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తే అయిన కుమారుడు జగన్మోహన్‌రెడ్డి జీవో 1214ను తెచ్చి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను రద్దు చేశారని విమర్శించారు. ఈ నేపథ్యంలో వచ్చేనెల ఒకటో తేదీన మంత్రి అంబటి రాంబాబు, 5న మంత్రి విడుదల రజనీ వద్దకు సామూహిక రాయబారం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆర్‌వివిఎన్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ రంగనాయకులు మృతి



ప్రజాశక్తి - అమరావతి : మండల పరిధిలోని ధరణికోటలోని రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ పి.రంగనాయకులు గురువారం అర్ధరాత్రి హైదరాబాదులోని తన కుమారుని నివాసంలో మృతి చెందారు. భౌతికకాయాన్ని అమరావతిలోని స్వగృహానికి శుక్రవారం ఉదయం తీసుకువచ్చారు. ప్రిన్సిపాల్‌గా దశాబ్ద కాలం పాటు పనిచేసి ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిన రంగనాయకులు మృతికి పలువురు సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో అమరావతి ఉపసర్పంచ్ ఎన్.విజయ సాగర్‌బాబు, కొండవీటి డెవలపర్స్ అధినేత కొండవీటి శ్రీనివాసరావు, కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఎస్.గాంధీ, కళాశాల పాలకవర్గ సభ్యులు వై.వి ఆంజనేయులు, సిహెచ్.జాజిబాబు, కె.నారాయణ తదితరులున్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న డాక్టర్ లక్ష్మణరావు

ఏరియా ఆస్పత్రిలో అన్ని రకాల ఆపరేషన్లు

సత్తెనపల్లి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

రోగులకు అవసరమైన అన్ని రకాల ఆపరేషన్లనూ సత్తెనపల్లిలోని ఏరియా ప్రభుత్వా ఆస్పత్రిలో చేస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం తమ ఆసుపత్రిలో హెర్నియా, హైడ్రోసెల్, లైపోమా, సేబాషియస్‌సిస్ట్, గాంగ్లియన్, సెల్యులైటిస్, గాంగ్రీన్, కార్న్, ఫైబ్రోమా, రొమ్ము కణితులు, డెర్మాయిడ్ లాంటి ఆపరేషన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటికి సంబంధించిన వైద్యులంతా అందుబాటులో ఉన్నారని, ఇవే ఆపరేషన్లు ప్రైవేటు ఆస్పత్రుల్లో చేయించుకోవాలంటే వేల రూపాయలు ఖర్చవుతాయని అన్నారు. పేదలకు ఈ ఆర్థిక భారమేమీ లేకుండా ప్రభుత్వాస్పత్రిలో వైద్యసేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కె.రామకృష్ణ, జనరల్ సర్జన్ సుష్మ, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సురేష్, ఏవో భవాని, ఆర్ఎంవో శోభారాణి పాల్గొన్నారు.

ధన రాజకీయాలు ఎల్లకాలం ఉండవు

- గుంటూరు ఛానల్ విస్తరణకు నిధులివ్వాలి
- హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం చైర్మన్ బి.వి.రాఘవులు
- ఘనంగా తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవం


విజ్ఞాన కేంద్రం ప్రారంభ సభలో మాట్లాడుతున్న బివి రాఘవులు

ప్రజాశక్తి-పెదనందిపాడు, గుంటూరు

కుల, ధన రాజకీయాలు ఎల్లకాలం కొనసాగలేవని, పాలకుల గురించి ప్రజలకు అర్ధమవుతుందని, కమ్యూనిస్టులకు మంచి రోజులు వస్తాయని సిపియం పొలిట్‌బ్యూరో సభ్యులు, హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం చైర్మన్ బి.వి.రాఘవులు అన్నారు. పెదనందిపాడులో నూతనంగా నిర్మించిన తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. విజ్ఞాన కేంద్రం ప్రధాన భవనం శిలాఫలకాన్ని రాఘవులు ఆవిష్కరించారు. అలాగే చెన్నుపాటి వెంకట సుబ్బయ్య మీటింగ్ హాల్‌ను విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, విజ్ఞాన కేంద్రం ఆఫీసును ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రారంభించారు. అనంతరం విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమేని మురళీకృష్ణ, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు, పారిశ్రామిక వేత్త దాసరి శేషగిరిరావు తదితరులు విజ్ఞాన కేంద్రం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్ అధ్యక్షత వహించారు. సభలో బి.వి.రాఘవులు మాట్లాడుతూ జాతీయోధ్య మంలో, కమ్యూనిస్టు ఉద్యమంలో పెదనందిపాడు ప్రాంతానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఇక్కడి పన్నుల సహాయ నిరాకణ ఉద్యమం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఆధునిక కాలంలోనూ విజ్ఞానానికి ప్రాధాన్యత తగ్గలేదని, విజ్ఞానాన్ని ఆర్జించే పద్దతులు మారాయన్నారు.ఆన్‌లైన్‌లో పుస్తకాలు వచ్చాయని, గ్రంధాలయాలకు ఆదరణ కరువైందన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విజ్ఞానాన్ని అందించటానికి ఇలాంటి విజ్ఞాన కేంద్రాలు విస్తృతంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇక్కడి నుండి ఎంతో మంది విదేశాలకు వెళ్లారని, అయితే వారి తెలివితేటలను, శక్తిని పాలకులు వినియోగించుకోకపోవటం వల్లనే ఈపరిస్థితి వచ్చిందన్నారు. చైనా, అమెరికా స్థాయికి భారత దేశం ఎదగాలంటే శ్రమని గౌరవించే సంస్కృతి రావాలన్నారు. అసమానతలు పోకుండా దేశంలో సూపర్‌పవర్‌గా ఎదగలేదన్నారు.స్త్రీ పురుషుల సమానత్వంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. రాష్ట్రంలో ఇప్పటిదాకా పరిపాలించిన అన్ని పార్టీలు మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టట్లేదన్నారు. రాష్ట్రంలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులు రూ.15వేల కోట్లతో పూర్తి అవుతాయని, సుమారు 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. కానీ ఎవ్వరూ పట్టించుకోవట్లేదన్నారు. కమిషన్ల కోసం పోలవరం వంటి పెద్ద ప్రాజెక్టులే చేబుతున్నారన్నారు. గుంటూరు ఛానల్, వరికెపుడిశెల వంటి వాటిని విస్మరిస్తున్నా రన్నారు. అలాగే రాష్ట్రంలో కీలకమైన విద్య, వైద్యం, ఉత్పత్తి రంగాల్లో వెనుకబడి ఉందని, ప్రభుత్వాలు వాటిపై దృష్టి పెట్టాలన్నారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విజ్ఞానం, సృజనాత్మకత పెంపొందించే విధంగా ఈ విజ్ఞాన కేంద్రం ఉండాలన్నారు. విజయవాడలో ఎంబివికె విజ్ఞాన కేంద్రం, విశాఖలో అల్లూరి సీతారామరాజు పేరుతో, గుంటూరులో జాషువా వంటి విజ్ఞాన కేంద్రాల ద్వారా బహుముఖ కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. పోటీ పరీక్షలు, స్కిల్ డెవలప్‌మెంట్, కంప్యూటర్ శిక్షణ వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గుంటూరు ఛానల్‌ను విస్తరణలో తొలి దశగా భూసేకరణకు రూ.120 కోట్లు, పల్నాడు జిల్లాలో వరికెపూడిశెల తొలి దశ పనులకు రూ.340 కోట్లు విడుదల చేస్తే పనులు ప్రారంభం అవుతాయన్నారు. వరికెపూడిశెలకు ఇప్పటికే మూడుసార్లు శంకుస్థాపన జరిగాయన్నారు. దశాబ్దాలుగా జిల్లాల్లో ఈరెండు ప్రాజెక్టులు నిరాదరణకు గురవుతున్నాయని అన్నారు. తక్షణమే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గుర్రం జాషువా మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు మాట్లాడుతూ జాతీయోద్యం నుండి ప్రస్తుతం గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకూ పొడిగించాలని సాగుతున్న పోరాటం వరకూ ఈ ప్రాంతానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఒక వైపు సైన్స్ వేగంగా అభివృద్ధి చెందుతుంటే మరోవైపు మూఢనమ్మకాలు ప్రచారం పెద్ద ఎత్తున జరుగుతుందని, దీనికి పాలకులు అండదండలు ఇస్తున్నారన్నారు. చంద్రుడిపైకి రాకెట్‌ను పంపిస్తుంటే, పూర్వకాలంలోనే పుష్పక విమానాలు ఉన్నాయని దుష్ప్రచారం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో శాస్త్రీయ భావజాలం పెంపొందించటానికి ఈ విజ్ఞాన కేంద్రం వేదికగా పనిచేయాలన్నారు. విజ్ఞాన విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ బ్రిటీషు వారిని వ్యతిరేకించిన, గొప్ప కమ్యూనిస్టు నాయకుడిగా ఎదిగిన కొల్లా వెంకయ్య పుట్టిన ఈ ప్రాంతంలో విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు. ప్రశ్నించే తత్వం ఈ ప్రాంతంలో, ప్రజల్లో ఇప్పటికీ ఉందన్నారు. సమాచార కేంద్రంగా, శిక్షణ కేంద్రంగా ఈ విజ్ఞాన కేంద్రాన్ని అభివృద్ధి చేయాలన్నారు. విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధికి విజ్ఞాన కేంద్రం సోపానంగా పనిచేయాలన్నారు. త్వరలో బాలోత్సవం నిర్వహించాలని సూచించారు. మహిళలకు స్వయం ఉపాధి, పోటీ పరీక్షల శిక్షణ ఇవ్వాలన్నారు. తేళ్ల నారాయణ కుమార్తె, ఉపాధ్యాయ ఉద్యమ నాయకురాలు తేళ్ల వినోద మాట్లాడుతూ ఆదినారాయణ చివరి వరకూ కమ్యూనిస్టుగా బ్రతికారని, ఆయన పేరుతో విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసుకోవటం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో ఈ కేంద్రం అభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు.సభలో ప్రముఖ పారిశ్రామిక వేత్త దాసరి శేషగిరిరావు, లావు వెంకటేశ్వర్లు కల్లూరి నాగేశ్వరరావు కళాపరిషత్ గౌరవాధ్యక్షులు ముద్దన రాఘవయ్య, సర్పంచ్‌ల సంఘం మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్రా బాలకృష్ణ, అభ్యుదయవాది గారపాటి రమేష్, పెదనందిపాడు కాలేజి ప్రిన్సిపాల్ వీరరాఘవయ్య, గుంటూరు ఛానల్ సాధన సమితి నాయకులు కుర్రా హరిబాబు, నరిశెట్టి ఆచారి, ముద్దన నాగరాజకుమారి, డివి సుబ్బారావు, కాపు వెంకట సుబ్బారావు, కాకుమాను నాగేశ్వరరావు, పోపూరి సుబ్బారావు, కాపు శ్రీను, కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.భవన నిర్మాణానికి భూరీ విరాళం అందచేసిన ఈ ప్రాంతవాసి, నాట్స్ అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరికి, ఇతర దాతలకు అభినందనలు తెలియ జేశారు. సభలో తొలుత ప్రజానాట్యమండలి రాష్ట్ర గాయకులు జగన్, పెద్దిరాజు, డి.శ్రీను తదితరులు గేయాలు ఆలపించారు.


విజ్ఞాన కేంద్రం ఆఫీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు


మీటింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న విజ్ఞాన్ సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య


నివాళులర్పిస్తున్న బివిఆర్, పాశం రామారావు తదితరులు


విజ్ఞాన కేంద్రం ఎదుట మొక్క నాటుతున్న బివిఆర్, పిన్నమనేని


విజ్ఞాన కేంద్రాన్ని పరిశీలిస్తున్న బివిఆర్ తదితరులు



గుంటూరు సదస్సులో అలరించిన విద్యార్థుల నృత్యాలు

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరులోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానా లు, ప్రస్తుత రాజకీయ పరిణా మాలపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. సదస్సులో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు, జిల్లా కార్యదర్శి పాశం రామారావు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రసంగిం చారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు నృత్య రూపకాలు ప్రదర్శించారు. గుంటూరులోని ఎంవిఎస్ మెమోరియల్ స్కూలు విద్యార్థులు, మంగళగిరి మండలం కాజ బాలల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పిఎన్‌ఎం రాష్ట్ర నాయకులు జగన్, గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యాదర్శులు ఎస్ పద్మ, దేవరకొండ శ్రీనివాస రావు, పల్నాడు జిల్లా కార్యదర్శి టి పెద్దిరాజు తదితరులు అభ్యుదయ గేయాలను ఆలపించారు.




జగన్, పెద్దిరాజు తదితరుల గేయాలాపన


ఎంవిఎస్ స్కూలు విద్యార్థుల నృత్యం




కాజ బాలికల నృత్యం



విఆర్‌ఎల నిర్బంధం అప్రజాస్వామికం

ప్రజాశక్తి - తుళ్లూరు

విఆర్‌ఎ ల అక్రమ నిర్బంధాలు అప్రజాస్వామికమని సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్ష,కార్యదర్శి ఎం రవి, ఎం భాగ్యరాజు అన్నారు. ప్రభుత్వ, పోలీసు చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఈ మేరకు శుక్రవారం తుళ్లూరు ఒక ప్రకటన చేశారు. విఆర్‌ఎ లకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుండడంతో తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు చలో విజయవాడ పిలుపు ఇచ్చిన విఆర్‌ఎ లను ఎక్కడికక్కడ అరెస్టులు చేయడంతో పాటు, ధర్నా చౌక్ వద్ద ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేసి విజయవాడ సిటీ లోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో నిర్బంధించడం దుర్మార్గమన్నారు. ధర్నాకు వెళ్ళ వద్దంటూ నాయకులకు ముందస్తుగా నోటీసులు ఇవ్వడం, తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించడాన్ని ప్రజాతంత్ర వాదులు అందరూ ఖండించాలని వారు కోరారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు పౌరులందరికీ ఉంటుందని, అక్రమంగా అరెస్టులు చేయించి భావ ప్రకటనా స్వేచ్ఛను హరించి వేయాలని చూస్తే తగిన శాస్తి జరుగుతుందని వారు హెచ్చరించారు.


చిత్రలేఖను అభినందిస్తున్న ఎంఇఒ తదితరులు

జిల్లాస్థాయి పోటీల్లో జడ్‌పి పాఠశాల విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి - చేబ్రోలు

వ్యాసరచనలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో విజయం సాధించిన జడ్‌పిహె హెచ్‌ఎస్ నారాకోడూరు విద్యార్థిని బి చిత్రలేఖ, 9వ తరగతి తెలుగు పద్యాలలో ద్వితీయ స్థానం పొందిన కె కుమార్ గణేష్‌లకు ఎంఇఒ ఆర్ సుబ్బారావు అభినందనలు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులను ప్రధాన ఉపాధ్యాయులు ఎం ఏడుకొండలు, టీచర్ రాజ్యలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.


గుడివాడ మినీ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న సాంబిరెడ్డి తదితరులు

మినీ డ్రెయిన్‌లో పూడిక తీయించాలి

ప్రజాశక్తి - తెనాలి

డ్రెయిన్ల పూడిక తీయించి, పొలాలు ముంపుకు గురి కాకుండా చూడాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి అధికారులను కోరారు. మండల పరిధిలోని గుడివాడ, అంగలకుదురు గ్రామాలలో శుక్రవారం ఆయన పర్యటించి రెండు గ్రామాల మధ్య గల మినీ డ్రెయిన్‌ను పరిశీలించారు. డ్రెయిన్లో గుర్రపు డెక్క, తూటి కాడ పూర్తిగా అల్లుకుపోయి నీటిపారుదల లేకపోవడాన్ని రైతులు ఆయన దష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుగ్గిరాల మండలం చిలువూరు నుంచి ప్రారంభమయ్యే డ్రెయిన్ కొలకలూరు, గుడివాడ, అంగలకుదురు మీదుగా సంగం జాగర్లమూడి వద్ద తుంగభద్ర డ్రెయిన్లో కలుస్తుందన్నారు. అయితే గుర్రపు డెక్క, తూటికాలతో పూడుకు పోవడంతో నీటి ప్రవాహం లేదన్నారు. భారీ వర్షాలు కురిస్తే నీరు పొలాల్లోకి వస్తుందని, ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. ఈ నేపథ్యంలో డ్రైనేజ్ అధికారులు తక్షణమే స్పందించి కాలువల పూడిక తీయించాలని కోరారు. విషయాన్ని డ్రైనేజీ డిఈఈ అనిల్ దష్టికి తీసుకెళ్లగా, సత్వర చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు సాంబిరెడ్డి చెప్పారు. ఆయన వెంట రైతులు బొద్దులూరి సురేష్, కొలకలూరి అశోక్ కుమార్, కె మోహన్ రావు తదితరులున్నారు.



తెలుగు భాష పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి - నాదెండ్ల

మండల కేంద్రమైన నాదెండ్లలోని సోషల్ వెల్ఫేర్ బాలుర హాస్టల్ లో శుక్రవారం జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (గార్డ్స్) ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం వారోత్సవాలలో భాగంగా 3వ రోజు కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి సొసైటీ ఉపాధ్యక్షులు గేరా యాకోబు అధ్యక్షత వహించారు. తెలుగు భాష రాష్ట్ర విశిష్ట పురస్కార గ్రహీత దార్ల బుజిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలుగు భాషను పరిరక్షించుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రతిరోజు పాఠశాల, లేదా హాస్టల్ గ్రంథాలయంలో గంట పాటు తెలుగులో ఉన్న కథల పుస్తకాలు, చదవాలని సూచించారు. ఇందులో భాగంగా 50 మంది విద్యార్థులకు కథలు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సలహాదారులు, మాజీ ఎజిపి డి.చిట్టిబాబు, సభ్యులు షేక్ బాజీ, హాస్టల్ వెల్ఫేర్ అధికారి సుబ్బారావు ఉన్నారు.

27న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటి, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్ రెగ్యులర్ షుగర్, బిపిల ఉచిత వైద్య శిబిరం ఈ నెల 27న నిర్వహించనున్నారు. యడ్లపాడు పిఆర్ విజ్ఞాన కేంద్రంలో ఈ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ క్యాంప్ పర్య వేక్షకులుగా సీనియర్ డాక్టర్ లింగమల్ల మోహన్ భాస్కర్ పాల్గొననున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, రెండు నెలలకు సరిపడా మందులు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మెప్మా ఆర్పీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని జై భీం భారత్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ విజయ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా వుంటు సంక్షేమ పథకాలను చేరవేసే భాధ్యత వీరిపైనే ఉందని, ఇంతటి గురుతర బాధ్యతను నిర్వహిస్తున్న వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి నెలకు రూ 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఈఎస్ఐ పెన్షన్ లాంటి సౌకర్యాలు కూడా వారికి ప్రభుత్వం కల్పించక పోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారి న్యాయమైన కోర్కెలు తీర్చాలని, లేనిపక్షంలో వారు నిర్వహించే న్యాయ పోరాటంలో తమ వంతు మద్దతు వుంటుందని ఆయన హామీ ఇచ్చారు.

బస్సు యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఈ నెల పల్నాడు జిల్లాకు రానున్న సిపిఐ బస్సు యాత్ర 27 వ తేదీన పల్నాడు జిల్లాకు రానున్న సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీ షర్ట్‌లను శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, పల్నాడు జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ 200 మంది యువకులు రెడ్ టీ షర్ట్ లతో ర్యాలీ బహిరంగ సభలో పాల్గొంటారని, తెలిపారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ షేక్ సుభాని, సీపీఐ సీనియర్ నాయకులు యు.రంగయ్య, పట్టణ కార్యదర్శి వి.వెంకట్, పాల్గొన్నారు.

ఆధార్ నంబర్ జత చేస్తేనే కూలీలకు వేతనాలు

డ్వామా పీడీ జి.జోసెఫ్ కుమార్



ప్రజాశక్తి-ఈపూరు

సెప్టెంబర్ 1 నుండి బ్యాంకు ఖాతాకు ఆధార్ నెంబర్ జత చేసిన ఉపాధి కూలీలకు మాత్రమే వేతనాలు అందుతాయని డ్వామా పిడి జి.జోసెఫ్ కుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 12,000 మంది ఉపాధి కూలీలు బ్యాంకు ఖాతాకు ఆధార్ నెంబర్ జత కాలేదన్నారు. పల్నాడు జిల్లాలో 5,53,874 లక్షల మంది ఉపాధి కూలీలు ఉండగా వారిలో 3,28,267 మంది పనిలో ఉన్నారన్నారు. 2022- 23 ఉపాధి పనులకు సంబంధించి రూ.180 కోట్లు ఖర్చు చేశామన్నారు. జిల్లాలో వెయ్యి ఎకరాలలో ఉద్యాన తోటలు సాగును లక్ష్యంగా పెట్టుకోగా 718 ఎకరాలు ఉద్యాన తోటలు సాగులో ఉన్నాయని సెప్టెంబర్ చివరి కల్లా నూరు శాతం సాధిస్తామన్నారు. అలాగే వర్షపు నీటిని వధా కాకుండా భూమిలోకి నీరు ఇంకే విధంగా రూఫ్ టాప్ వాటర్ ఇన్వెస్టింగ్ సిస్టం కార్యక్రమాన్ని ప్రభుత్వ భవనాలలో అమలు చేస్తున్నామన్నారు. పల్నాడు జిల్లాలో 9 మండలాలలో ఈ ప్రాజెక్టును అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పిడి తెలిపారు.

బిపి మండల్‌కు నివాళి

ప్రజాశక్తి - చిలకలూరిపేట



శ్రీ కృష్ణా యాదవ్ అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఎస్‌కెవైఒపిఎ ఆధ్వర్యంలో స్థానిక సిఆం క్లబ్‌లో బిపి మండల్ జయంతిని శుక్రవారం నిర్వహిం చారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అసోసియేషన్ గౌరవాధ్యక్షులు గోరంట్ల నారాయణ మాట్లాడుతూ బిసిలకు కేంద్రంలో ఒబిసి రిజర్వేషన్లు కల్పించిన మహానుభావులు మండల్ అని కొనియాడారు. అయితే, మండల్ సిఫార్సులను పాలకులు నేటికీ అమలు చేయడం లేదని అన్నారు. బిసి లంతా కలసి రాబోయే కాలంలో ఉద్యమించాల్సిన అవసర ముందని అభిప్రాయపడ్డారు.

బిసి లకు చట్టసభ ల్లో రిజర్వషన్లు లేవని, దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారని, జనగణనలో బిసి జనాభాను లెక్కించాలని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బి సి ఉద్యోగులకు ప్రమోషన్స్ లో రిజర్వేషన్లు అమలు చేయాలని, జనాభా ప్రాతిపదికన ఎమ్మెల్యే, ఎంపి సీట్లు కేటాయించాలని, మండల్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్య క్రమంలో అధ్యక్షులు జి.భానుప్రకాష్‌యాదవ్, కార్యదర్శి ఎన్. నాగరాజు, వై.నాగయ్య, ఎం.శ్రీనివాసరావు, ఉప్పల భాస్కర్ రావు, నాయక్, బి సి ఉద్యోగుల సంఘ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు యాదవ్ పాల్గొన్నారు.

నేటి నుండి మదర్ థెరిస్సా జయంతి వేడుకలు

- **థెరిస్సా వర్థంతి నుండి జయంతి వరకు హాస్పిటల్ లో ఉచిత వైద్య శిబిరం**
- **మదర్ థెరిస్సా హాస్పిటల్ అధినేత డాక్టర్ నాగోతు ప్రకాశరావు**
- **3న అనన్య హాస్పిటల్ ఆధ్వర్యంలో అనాథలకు, వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం**
- **డాక్టర్ సింగరాజు సాయికృష్ణ**

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

జిల్లా కేంద్రం నరసరావుపేట పల్నాడు రోడ్ లోని సెయింట్ మదర్ థెరిస్సా విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ నుండి వచ్చే నెల 4వ తేదీ వరకు మదర్ థెరిస్సా జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు సెయింట్ మదర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు వంకాయలపాటి రవి,తెలుగు సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలి పారు. సెప్టెంబర్ 5న మదర్ థెరిస్సా వర్థంతి కార్యక్రమం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని, మదర్ థెరిస్సా విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు మిట్టపల్లి రమేష్, గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్,డాక్టర్ సింగరాజు సాయికష్ణ,డాక్టర్ నాగోతు ప్రకాశరావు,భాగవతుల లక్ష్మీ నారాయణ(దుర్గాబాబు),పాదర్తి ప్రసాద్, రాయల శ్రీని వాసరావుల ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు వివిధ సేవా కార్యక్రమాలు నిర్విరామంగా జరుగుతాయని పేర్కొ న్నారు.

ఈ సందర్భంగా మదర్ థెరిస్సా మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ లో బి.పి,షుగర్ వ్యాధిగ్రస్తులకు ఏడాది పాటు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులలో 10 శాతం రాయితీ కల్పిస్తామని, మదర్ థెరిస్సా జయంతి కార్యక్రమం నుండి వర్థంతి కార్యక్రమం వరకు మదర్ థెరిస్సా మల్టీ స్పెషాలిటీ హాస్పటల్‌లో నిర్వహించే ఉచిత మెగా వైద్య శిబిరంలో రోగులకు అవసరమైన శస్త్ర చికిత్సలలో, మందులలో, రక్త పరీక్షలలో రాయితీ కల్పించి తక్కువ ఫీజులతో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా సెప్టెంబర్ 3న నరసరావుపేట పట్టణంలోని అనాథలకు, వృద్ధాశ్రమాల్లో నివసిస్తున్న వయో వృద్ధులకు అనన్య హాస్పటల్స్ లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తామని అనన్య హాస్పటల్స్ అధినేత డాక్టర్ సింగరాజు సాయికృష్ణ తెలిపారు. రోగులకు ఉచిత వైద్య పరీక్షలు,ఉచిత రక్త పరీక్షలు నిర్వహించి,ఉచితంగా మందులను అందజేస్తామని తెలిపారు. కుల,మత,రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

విజయసాయిరెడ్డికి ఆ స్థాయి లేదు : టిడిపి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

విశాఖపట్నంలో కూతురి బంధువుల పేరిట వందల ఎకరాల ప్రభుత్వ భూమిని దోచుకుని విశాఖపట్టణాన్ని భ్రష్టు పట్టించిన వ్యక్తి విజయసాయిరెడ్డికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, లోకేష్‌ను విమర్శించే స్థాయి లేదని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జివి ఆంజనేయులు విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. రాబోయే ఎన్నికల్లో పల్నాడు జిల్లాలో వైసిపికి ఒక్క సీటు కూడా రాదని పేర్కొన్నారు. పల్నాడు జిల్లాకు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నాలుగున్నరేళ్లు దాటినా అమలు చేయలేదని, వీటి గురించి విజయసాయిరెడ్డి చెప్పకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. జిల్లాలో వైసిపి నాయకులు, ఎమ్మెల్యేలపై ప్రజలలో ఉన్న వ్యతిరేకత, నాయకులకు, ప్రజాప్రతినిధులకు, కార్యకర్తలకు ఉన్న సమన్వయ లోపాలను సరిచేసుకోవడం చేతకాని ఎంపి విజయసాయిరెడ్డి టిడిపిపై అనవసర ఆరోపణలతో తన పర్యటనను ముగించుకున్నారని ఎద్దేవ చేశారు. రాష్ట్రంలో టిడిపి పుంజుకుందని, రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడం తథ్యమని పేర్కొన్నారు. యువగళం పాదయాత్ర ఎక్కడికక్కడ విజయవంతం అవుతుందని, దీంతో వైసిపికి ఓటమి భయం పట్టుకుందని, అందుకే సమీక్షలు పేరిట టిడిపిపై బురదజల్లి రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నారని విమర్శించారు.

తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన అప్రాపున్నీషా బేగం

ప్రజాశక్తి - రాజుపాలెం



మండల తహశీల్దార్‌గా అప్రా పున్నీషా బేగం శుక్రవారం బాధ్య తలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యల పరి ష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సం క్షేమ పథకాలు, కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరువ చేసి మండలాన్ని అభివృద్ధిలో నడిపిస్తానన్నారు. అనంతరం విఆర్ఒలు, విఆర్ఎ రెవెన్యూ సిబ్బందితో సమా వేశమయ్యారు. సిబ్బంది అందరూ తమ విధుల పట్ల బాధ్యతగా వ్యవ హరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు.

పబ్లిక్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి

పల్నాడు జిల్లా అభివృద్ధి అధికారి వై.మహాలక్ష్మి

ప్రజాశక్తి -రెంటచింతల

పేద ప్రజల కోసం వివిధ రకాల సంక్షేమ కార్యక్రమాలు ఉండే పబ్లిక్ యాప్ ను వాలంటరీలు, సచివాలయ ఉద్యోగులు, వెల్ఫేర్ అసిస్టెంట్స్ తమ చరవాణిలో డౌన్ లోడ్ చేసుకోవాలని పల్నాడు జిల్లా అభివృద్ధి అధికారి వై.మహాలక్ష్మి ఆదేశించారు. గ్రామ వార్డు సచివాలయాల డైరెక్టర్ లక్ష్మీ షా ఈ మేరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశిస్తూ పలు సూచనలు చేశారన్నారు.ప్రతి ఉద్యోగి లబ్ధిదారులతో మాట్లాడి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీయాలన్నారు. విద్యా సర్వే ఈ నెలాఖరు కల్లా పూర్తి చేయాలని కోరారు.

వైసిపి పల్నాడు జిల్లా కార్యదర్శిగా రాంబాబు

ప్రజాశక్తి- రెంటచింతల

గ్రామాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ, లక్షలాది రూపాయలు విరాళంగా ఇస్తూ గ్రామంలోని అందరూ మన్ననలు పొందుతున్న పల్లెర్ల సత్య వెంకట్రామిరెడ్డి ఆలియాస్ రాంబాబును వైసిపి పల్నాడు జిల్లా కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకష్ణారెడ్డి శుక్రవారం ఉతర్వులు జారీ చేశారు. 1988లో బిటెక్ పూర్తి చేసిన రాంబాబు బిల్డర్‌గా స్థిరపడ్డారు. ప్రస్తుతం శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్ గా వ్యవహరిస్తున్నారు. బస్సు షెల్టర్ నిర్మాణం, ఇండోర్ స్టేడియం ఏర్పాటు, తాగు నీటి ట్యాంక్ నిర్మాణం వంటి కార్యక్రమాలు చేపట్టారు.



బెజగం రవికుమార్‌ను సన్మానిస్తున్న చిత్రం (ఫైల్‌ఫొటో)

అష్టాదశ పురస్కారాల గ్రహీత బెజగం రవికుమార్

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పట్టణానికి చెందిన వర్ధమాన పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్ వివిధ పౌరాణిక పాత్రలను పోషించి రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలను రం జింప చేశారు. ఇందుకుగాను రెండు రాష్ట్రాల స్థాయిలోని వివిధ సాంస్కృతిక సంస్థలు, కళా పరిషత్తులు 2022 నుండి 2023 జులై వరకు, 11 కళా సంస్థలు, సాంస్కృతిక సేవా సంస్థలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, రవికుమార్‌కి 18 పురస్కారాలను ప్రదానం చేశాయి. విశాఖపట్టణానికి చెందిన విశాఖ రత్న కళాపరిషత్, దాసరి నారాయణ కల్చరల్ అకాడమీ వారి జాతీయ రత్న నుండి ఒంగోలుకు చెందిన లిటిల్ ఛాంప్స్ అకాడమీ లోటస్ కల్చరల్ ఆర్గనైజేషన్ వారి జాతీయ, పౌరాణిక, కళారత్న, జాతీయ పౌరాణిక కళా సామ్రాట్, తెలుగు వెలుగు సాహితి వేదిక వారి మహానంది ఉగాది పురస్కారాలు మొదలగు ఆవార్డులను ప్రదానం చేశారు. ఈ ఆవార్డులలో 12 జాతీయ పురస్కారాలు,6 సాధారణ పుర స్కారాలు ఉన్నాయి. ఈ పురస్కారాలు మొత్తం పౌరాణిక రంగం నుండే పొందారు.

యానిమేటర్లను వేధింపులకు గురిచేయొద్దు

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

యానిమేటర్లకు టార్గెట్లు పెట్టి వేధింపులకు గురి చేయడం సబబుకాదని యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం సిఐటియు జిల్లా గౌరవాధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ అధికారులను డిమాండ్ చేశారు. కాకుమాను మండల యానిమేటర్ల సమావేశం స్థానిక మహిళా మండలి ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి జిల్లా యానిమేటర్ల సంఘం సహాయ కార్యదర్శి శివకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ యానిమేటర్లకు వేతనం రూ.26,000 ఇవ్వాలని, యానిమేటర్లకు మూడేళ్ల కాలపరిమితిని, 45 సంవత్సరాల వయోపరిమితిని తక్షణమే రద్దు చేయాలని కోరారు. స్వయం సహాయక గ్రూపులలో జరిగిన అవకతవకులకు ప్రతిదానికి యానిమేటర్లనే బాధ్యులుగా చేయడం సరికాదని, వారిపై రాజకీయ వేధింపులు ఆపాలని, వాని జీతాన్ని వారి పర్సనల్ ఖాతాల్లోనే వేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, ప్రమాద బీమా అమలు చేయాలని కోరారు. శివకుమారి మాట్లాడుతూ కోళ్ళు, గేదెలు, గొర్రెలు, విత్తనాలను బలవంతంగా అమ్మాలని టార్గెట్లు పెట్టి వారిని వేధింపులకు గురి చేయడం సరికాదని అన్నారు. ఈ సందర్భంగా యానిమేటర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్.రమాదేవి, సుబ్బాయమ్మ, కోశాధికారిగా షేక్ ఆశా, ఉపాధ్యక్షులుగా సుజాత, సరిత, సహాయ కార్యదర్శిగా అనూష, అమల సంఘం గౌరవాధ్యక్షులుగా కందుల శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రదర్శన అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపిపి, ఎండిఒ, ఎపిఎంలకు అందజేశారు.



కాకుమానులో ప్రదర్శన నిర్వహిస్తున్న యానిమేటర్లు

ధ్యానంతో ప్రశాంతత, జ్ఞాపకశక్తి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్


ధ్యానం గురించి వివరిస్తున్న వక్త రాధాదేవి

ధ్యానం చేస్తే ప్రశాంతమైన జీవితంతో పాటు జ్ఞాపకశక్తి వస్తుందని బ్రహ్మ కుమారీస్ ఆశ్రమ ప్రతినిధి రాధా దేవి అన్నారు. కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలోని సాక్ హాలులో విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్. హనుమంత రావు అధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'టచ్ ది లైట్' అనే కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. విద్యార్థులకు ధ్యానం పట్ల అవగాహన కల్పించారు. నేటి ఒత్తిడి ప్రపంచంలో ప్రశాంతమైన జీవితం లేక అనేక మంది తీవ్రమైన వేదనకు గురవుతున్నారని, ధ్యానం ద్వారా ప్రశాం తతను, జ్ఞాపక శక్తిని పొందవచ్చని ఆమె అన్నారు. హనుమంతరావు మాట్లాడుతూ సమయం వృథా అని అనుకోకుండా ప్రతి ఉదయం కొన్ని నిముషాలు ధ్యానంలో గడిపితే మనలో ఉన్న శక్తి స్థాయిలు పెరుగుతాయని అన్నారు. వర్శిటీ మానసిక నిపుణులు విజయరత్నం మాట్లాడుతూ ఉదయం లేచిన తరువాత మనం గడిపే మొదటి పదిహేను నిముషాలు రోజంతా మనల్ని నియంత్రిస్తాయని అన్నారు. కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ఆలపాటి పెళ్ళికానుక పంపిణీ

ప్రజాశక్తి-తెనాలి

నియోజకవర్గంలో పేద కుటుంబాలలో వివాహాలకు పెళ్ళికానుక అందిస్తామని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం కొలకలూరుకి చెందిన గుమ్మడిదల రాజేశ్వరరావు, పద్మ దంపతుల కుమార్తె గుమ్మడిదల నాగలక్ష్మి వివాహ సంద ర్భంగా ఆమెకు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పార్టీ నాయకులతో కలిసి తాళిబొట్టు, చీర, సారెను అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముసలయ్య సుబ్బారావు, కె,కోటేశ్వరి పాల్గొన్నారు. అలాగే, పట్టణంలోని 31వ వార్డుకు చెందిన కందుల జీవానందం , పద్మ దంపతుల కుమార్తె ప్రియదర్శిని వివాహ సందర్భంగా ఆమెకు ఆలపాటి పెళ్లి కానుకగా పార్టీ నాయకులు ఉంగరాన్ని, చీర , సారే అందించారు. కార్యక్రమంలో 31 వ వార్డు నాయకులు వి.నగేష్, సుధా రజనీకాంత్, రామ అశోక్, కె.వెంకటేశ్వర్లు, దనారాజుపల్లి రాంబాబు, ఆర్.శ్రీనివాస్, కె. యేసు రాజు పాల్గొన్నారు.

బిపి మండల్‌కు నివాళి

ప్రజాశక్తి-మంగళగిరి



బీసీల పితామహుడు బీసీల రిజర్వేషన్ల హక్కుల సాధన కోసం తన జీవితాంతం పోరాడిన అభ్యుదయ వాది బిపి మండల్ 105వ జయంతి కార్యక్రమాన్ని మం గళగిరి నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పారేపల్లి మహేష్ మాట్లాడుతూ మండల్‌కు బీసీలు అందరూ జీవితాంతం రుణపడి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు యు.శ్రీనివాస్, నియో జకవర్గ జాయింట్ సెక్రెటరీ టి. కిరణ్, పట్టణ అధ్యక్షులు ఎం.సత్యనారాయణ, పట్టణ టిడ్కో గృహాల నాయకులు ఎ.సుబ్బారావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు బి.ఈశ్వరి, సహాయ కార్యదర్శి కె.వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.



రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ రామ్మోహన్‌రావుకు సత్కారం

ప్రజాశక్తి-తాడేపల్లి

రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన బిలుగుది వెంకట రామ్మోహన్‌రావును కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, రాష్ట్ర రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వడ్డాది మధుసూదన్‌రావు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ కార్యాలయంలో ఓ కార్యక్రమం నిర్వహించారు. కనకారావు, మధుసూదన్‌రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, రెల్లి, మైనార్టీ వర్గాలకు పెద్ద పీట వేశారని, అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని అన్నారు. వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. వెంకట రామ్మోహన్‌రావు మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి తాడేపల్లి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, కృష్ణ,గుంటూరు జిల్లాల వికలాంగుల రీజనల్ కో-ఆర్డినేటర్ డి.మధుకిరణ్ పాల్గొన్నారు.

మట్టిఖర్చులకు రూ.10,000 అందజేత

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్



పట్టణంలోని ముబారక్ నగర్ 21వ వార్డు లో నివసిస్తున్న షేక్ బాజీ మృతి చెందాడు. మృతుని కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10,000 మాజీ కౌన్సిలర్ నయీమ్ బాషా చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. నయీమ్ బాషా మాట్లాడుతూ మృతుని కుటుంబానికి బీమా చెక్కును త్వరలోనే అందజేస్తామని చెప్పారు. బాజీ కుటుంబానికి శాసనసభ్యులు కిలారి వెంకట రోశయ్య ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పైప్ లైన్ కోసం తవ్విన గుంత పూడ్చండి

ప్రజాశక్తి-మంగళగిరి

పట్టణ పరిధిలోని మిద్దిసెంటర్ లో తాగునీటి పైపు లైన్ ఏర్పాటు కోసం రోడ్డును పగల గొట్టి గుంత తవ్వారు. పైప్ లైన్ ఏర్పాటు చేసిన అనంతరం గుంతలు పూడ్చ లేదు. దీంతో ఇటుగా రాకపోకలు సాగించే వాహన దారులు పలు సందర్భాల్లో ప్రమాదాలకు గురవుతుతున్నారు. రోడ్డు పగలగొట్టి రెండు నెలలకు పైగా అయింది. ఇంతవరకు గుంతలను పూడ్చలేదు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి గుంతలను పూడ్పించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.





వల్లభాపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'

ప్రజాశక్తి-తెనాలి

డాక్టర్ వైయస్సార్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శుక్రవారం కొల్లిపర మండలం వల్లభాపురంలో నిర్వహించారు. వైద్యాధికారిణి డాక్టర్ చిక్కాల లక్ష్మీ సుధ ఆధ్వర్యంలో గ్రామం లోని అంగన్వాడి సెంటర్లో నిర్వహించారు. గర్భిణులు, రోగులను పరీక్షించి, రక్తపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంగన్వాడీ చిన్నారులకు కూడా వైద్యపరీక్షలు నిర్వహించారు. గర్భిణులు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని ఆమె సూచించారు. శిబిరానికి రాలేని వారికి ఇంటివద్దే పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ బి కోటిరెడ్డి, యం.యల్.హెచ్ పి. సరళ, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి కె.శ్యామ్ జ్యోతి, అంగన్వాడి, ఆశా కార్యకర్త కృష్ణకుమారి పాల్గొన్నారు.



హెల్త్ హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక ప్రకాశం రోడ్డులోని హెల్త్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం వహాబ్ రోడ్ లోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఆ సంస్థ ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యు లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఉద్యో గులకు కంటి పరీక్షలు, బిపి, షుగర్ పరీక్షలు నిర్వ హించి మందులు పంపిణీ చేశారు. కంటి సమస్యల నివారణకు పలు సూచనలు చేశారు. శిబిరాన్ని బిఎస్ఎన్ఎల్ ఎఈ నారాయణరావు ప్రారంభించారు. హెల్త్ హాస్పిటల్ సిఇఒ గిరిబాబు పర్యవేక్షణలో హాస్పిటల్ వైద్య బృందం పాల్గొన్నారు.



నారా లోకేష్ సహకారంతో తాగునీటి సరఫరా

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని 17, 19, 20, 26 వార్డులకు నారా లోకేష్ సహకారంతో వాటర్ ట్యాంకర్ల ద్వారా శుక్రవారం తాగునీటిని సరఫరా చేయించారు. తాగునీటిని సరఫరా చేసే పైపు లైన్లు మరమ్మత్తులకు గురి కావడంతో గత మూడు రోజులుగా తాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడు తున్నారు. పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వెంటనే స్పందించారు. జలధార పేరుతో రెండు మంచినీటి ట్యాంకర్లను పంపించి, 5 ట్రిప్పుల తాగునీటిని సర ఫరా చేయించారు. ఈ సందర్భంగా లోకేష్‌కు ఆయా వార్డుల నివాసితులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులను కించపరచటం తగదు

-యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు

బోధన కంటే బోధనేతర కార్యక్రమాల చుట్టూ ఉపాధ్యాయుల్ని తిప్పుతూ, పాఠశాలల పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయు లను కించప రుస్తూ మాట్లాడటం సరికాదని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. యుటిఎఫ్ ఆఫీసు బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం బ్రాడీపేటలోని సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బోధనేతర కార్యక్రమాలపైనే పర్యవేక్షణ ఎక్కువగా ఉంటుందన్నారు. తెలుగు మీడియం బోధించే ఉపాధ్యాయులతో బలవంతంగా ఇంగ్లీషు మీడియంలో బోధింపచేస్తున్నారని, విద్యార్థులు ఇంగ్లీషులోనే పరీక్షలు రాయాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. బోధనలో స్వేచ్ఛ, ప్రశాంత వాతావరణం కల్పిస్తేనే విద్యార్థికి నాణ్యమైన విద్య అందుతుందని చెప్పారు. పాఠశాలల్లో ఉన్నతాధికారుల పర్యవేక్షణ సూచనలు, సలహాలు ఇచ్చేదిగా ఉండాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ యం.హనుమంతరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు పాత పెన్షన్ పునరుద్ధరించాలని, నిరసన తెలిపే వారిపై నిర్బంధాలు ఆపాలని కోరారు. పాత పెన్షన్ ఇచ్చే వరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యం.కళాధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులను వేధిస్తే నాణ్యమైన విద్య అందించటం సాధ్యం కాదన్నారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఏఎల్ శివపార్వతి, జిల్లా కోశాధికారి దౌలా, ఇతర సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న జెసి రాజకుమారి

అక్టోబర్ 2 నుండి ఆడుదాం ఆంధ్ర : జెసి

ప్రజాశక్తి-గుంటూరు : గ్రామ సచివాలయం స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకూ అక్టోబర్ 2 నుండి నవంబర్ 8 వరకూ నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమారి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై జేసీ రాజ కుమారి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీ బాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాలు వున్నాయ న్నారు. 17 ఏళ్ల వయస్సు దాటిన ప్రతి ఒక్కరూ వీటిల్గొ పాల్గొనవచ్చన్నారు. సచివాలయ స్థాయిలో అక్టోబర్ 2 నుండి 7వ తేదీ వరకు, 10వ నుండి 19 వరకూ మండల స్థాయిలో, 22 నుండి 25 వరకూ నియోజకవర్గ స్థాయిలో, 28 నుండి 31 వరకూ జిల్లా స్థాయి పోటీ లు, నవంబర్ 4 నుండి 7 వరకూ రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీలకు అవస రమైన అవసరమైన ఆట స్థలాలు గుర్తింపు, భోజన వసతి , వైద్య సదుపాయాలు, రవాణా తదితర అంశాలపై చర్యలు తీసుకోవాలన్నారు. పోటీలలో గెలిచిన వారికి ట్రోఫీలు, మెడల్స్ , సర్టిఫికెట్లు, నగదు బహుమతి కూడా ఉంటుంద న్నారు. సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఆర్ఓ కె.చంద్ర శేఖర రావు, ఆర్‌డిఒ ప్రభాకర రెడ్డి, స్టెప్ సిఈఓ యస్.పల్లవి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా నిర్మాణం

మాతాశిశు సంరక్షణ కేంద్రం పనులను పరిశీలించిన డాక్టర్ పొదిల ప్రసాద్, డాక్టర్ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



మాత శిశుసంరక్షణ కేంద్రాన్ని కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా నిర్మిస్తున్నట్లు ఉత్తర అమెరికా పూర్వ విద్యార్థుల అసోసియేషన్ (జింకానా) డాక్టర్ పొదిల ప్రసాద్ తెలిపారు. శుక్రవారం డాక్టర్ పొదిల ప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తో కల్సి యం సి హెచ్ బ్లాక్ ను సందర్శించారు. ఈ సందర్భంగా పొదిల ప్రసాద్ మాట్లాడుతూ ఈ భవనం లో అన్నీ సదుపాయాల తో ప్రసూతి, స్త్రీ వ్యాధుల చికిత్స విభాగాన్ని ఈ జి ప్లస్ 7 బహుళ అంతస్తుల భవనం లో ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈ భవనం పూర్తి చేస్తున్నామని ఆయన అన్నారు. ఇప్పటికే జింఖానా ఆడిటోరియం, పొదిల ప్రసాద్ బ్లాక్ సూపర్ స్పెషలిటీ ట్రామా సెంటర్ లు బాగా పని చేస్తున్నాయన్నారు. జింకానా కో ఆర్డినేటర్ డాక్టర్ బాల భాస్కరరావు, డాక్టర్ హనుమంత రావు లు నిర్మాణ పనులు దగ్గర ఉండి పర్యవేక్షణ చేస్తున్నారని ఆయన చెప్పారు. పొదిల ప్రసాద్ బ్లాక్ నిర్మాణ సమయం లో సూపరింటెండెంట్ గా, ఇప్పుడు యం సి హెచ్ బ్లాక్ నిర్మాణ సమయం లో సూపరింటెండెంట్ గా డాక్టర్ కిరణ్ కుమార్ ఉండటం సంతోషమని ఆయన చెప్పారు. జిజిహెచ్ లో విస్తరణకు అవకాశం లేకపోవడం వల్ల కాకుమాను వారి తోటలోని ఆరు ఎకరాల స్థలంలో ప్రత్యేకంగా నాలుగైదు విభాగలను ఏర్పాటుకు సన్నాహాలు చేయడం అభినందనీయమని చెప్పారు. ఈ స్థల ఆవరణ ను ప్రహరీ గోడ నిర్మించేందుకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఆయన తెలిపారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ యం సి హెచ్ బ్లాక్ ఏడు అంతస్థుల భవనం పూర్తి అయితే ఎంతో అద్భుతం గా ఉండబోతుందన్నారు. ఈ భవనం లో 600 పడకలు అందుబాటులో కి వస్తాయని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని చొరవ తో యం సి హెచ్ పనులు చురుకుగా సాగుతున్నాయని ఆయన తెలిపారు. భావి తరాలకు ఈ బ్లాక్ ఎంతో ఉపయోగం గా మారుతుందని ఆయన చెప్పారు. సివిల్ సర్జన్ ఆర్ యం ఒ డాక్టర్ సతీష్ కుమార్, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్ఐ అభ్యర్థులకు నేటి నుంచి దేహదారుఢ్య పరీక్షలు

ఏర్పాట్లను పరిశీలించిన డిఐజి పాల్‌రాజ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రేంజ్ పరిధిలో యస్ ఐ పోస్టులకు నియామక ప్రక్రియలో భాగంగా అర్హత సాధించిన అభ్యర్థులకు దేహధారుడ్య పరీక్షలు గుంటూరు పోలీసు పేరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. డిఐజి పాల్ రాజ్, ఎస్పి ఆరీఫ్ హాఫీజ్ శుక్రవారం ఇందుకు సంబంధించిన తుది ఏర్పాట్లను పూర్తి చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 100 మీటర్ల పరుగు పందెం,1600 మీటర్ల పరుగు పందెం, ఎత్తు , బరువు, ఛాతి కొలతలు, లాంగ్ జంప్ చేసే తీసుకునే ప్రతి ప్రదేశం క్షుణ్ణంగా పరిశీలించి అభ్యర్థులకు ఎలాంటి అంతరాలు అటంకాలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. దేహాదారుడ్య సామర్థ్య పరీక్షలను ఎటువంటి అనుమానాలకు తావివ్వకుండా నిష్పక్షపాతంగా పారదర్శకంగా పోటీలు నిర్వహించేందుకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసినట్టు ఆయన మీడియాకు తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించేందుకు ఆయా ప్రాంతాల్లో మెడికల్ విభాగము అంబులెన్స్ ఏర్పాటు చేశారు. ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షను పూర్తి చేసిన అభ్యర్థులకు ఫిజికల్ మెజర్ మెంట్, ఫిజికల్ ఎఫిషియన్స్ టెస్ట్ నిర్వహిస్తారు. గుంటూరు రేంజ్ పరిదిలో 12 వేల 957 మంది అభ్యర్థులు పాల్గొంటు న్నారు. వీరిలో 1909 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. దేహ దారుఢ్య పరీక్షలలో పాల్గొనేందుకు ముందుగానే అభ్యర్థులకు సమాచారం పంపారు. ప్రతి రోజు రోజూ ఉదయం 5 గంటల నుండి దేహదారుఢ్యల పరీక్షల ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ప్రతిరోజు అభ్యర్థులకు మొదటగా సర్టిఫికెట్స్ పరిశీలన చేస్తారు.ఎత్తు, చాతీ వంటి ఫిజికల్ మెజర్ మెంట్స్ చేస్తారు. తర్వాత బయోమెట్రిక్ తీసుకుంటారు. దేహదారుఢ్య పరీక్షలలో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహిస్తారు. దేహ దారుఢ్య పరీక్షల దగ్గర ఎక్కడ కూడా ఏలాంటి ఆరోపణలు, పొరపాట్లకు తావు లేకుండా ఆధునిక కంప్యూటరైజ్డ్ టెక్నాలజితో డిజిటల్‌గా, పారదర్శకంగా ఈ వెంట్స్‌కు సంబంధించిన పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఎస్సై అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తామంటూ దళారుల మాటలు నమ్మవద్దని , ప్రలోభాలకు గురికావద్దని కోరారు. ఆగష్టు 26 వ తేది నుండి సెప్టెంబర్ 16 వ తేది వరకు గుంటూరు పెరేడ్ గ్రౌండ్స్ మైదానంలో ఈవెంట్స్ జరుగుతాయని తెలిపారు. గుంటూరు రేంజ్ పరిధిలో జిల్లాల ఎస్పీల సహకారంతో పోలీసు సిబ్బంది రోజు ఉదయం 4 గంటల నుండి విధులు నిర్వహిస్తున్నారు. పరుగు పందెంలో పాల్గొనే అభ్యర్థులకు అత్యవసర పరిస్థితులలో ఏదైనా జరిగితే అంబులెన్స్, డాక్టర్స్ వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. దేహాదారుడ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వెరిఫికేషన్ కోసం ఖచ్చితంగా ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని, లేటెస్ట్ కుల ధ్రువీకరణ సర్టిఫికెట్, క్రిమిలేయర్ సర్టిఫికెట్ తీసుకురావాలి. వాటితో పాటు ఆధార్, అడ్మిట్ కార్డు, స్టడీ, మార్కిలిస్టులు, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు జిరాక్స్ సర్టిఫికెట్లు (గెజిటెడ్ సంతకం) తప్పనిసరిగా తీసుకుని రావలెనని తెలిపారు. అదే విధంగా శుక్రవారం రావాల్సిన అభ్యర్థులు వచ్చేనెల 16న దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలియజేశారు. గుంటూరు జిల్లా ఎస్పి ఆరీఫ్ హఫీజ్, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కే కోటేశ్వరరావు, ఒంగోలు అదనపు ఎస్పీ అశోక్ బాబు గారు, రేంజ్ పరిధిలో డిస్పీలు, సిఐలుపాల్గొన్నారు.



ట్రైల్ రన్ నిర్వహిస్తున్న డిఐజి, ఎస్పి

పరిశ్రమలకు రాయితీలపై అవగాహన సదస్సులు

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై అవగాహనకు ప్రత్యేకంగా సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి పరిశ్రమలు, అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలక్టరేట్‌లో జిల్లా ఇండస్ట్రియల్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ (డీఐఈపీసీ) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు అందించిన దరఖాస్తులను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్దేశిత సమయంలో పారదర్శకంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్‌లో వున్న దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతుల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పరిశ్రమల ప్రోత్సాహకాలకు సంబంధించి 59 క్లైయిమ్స్‌కు రూ.7,18,83,225లు మంజూరు చేస్తూ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆమోదించారు. సమావేశంలో ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ డైరెక్టర్ విజయలక్ష్మీ , జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ విజయ రత్నం, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ వి.గోపికృష్ణ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

బడి ఈడు పిల్లల్ని పాఠశాలల్లో చేర్పించాలి

జిల్లాలో 5 నుంచి 18 ఎళ్ళ వయస్సు కలిగిన పిల్లల నమోదు నూరుశాతం పూర్తి అయ్యేలా విద్యాశాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎడ్యుకేషన్ సెక్రెటరీలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గ్రాస్ ఎన్‌రోల్ మెంట్ రేషియో, హౌసింగ్, ఇతర అంశాలపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్లస్టర్ల వారీగా నిర్వహిస్తున్న గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే నేటి సాయంత్రానికి పూర్తి అయ్యేలా పర్యవేక్షించాలన్నారు. తెనాలి మండలంలో సర్వే నూరు శాతం పూర్తి అయ్యిందని తెలియజేస్తూ, ఇందుకు కృషి చేసిన అధికారులు, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. నమోదు కాని వారందర్నీ గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అలాగే బడి మానేసిన పిల్లల తల్లిదండ్రులతో ఎంఈవోలు, ఎంపీడీవోలు, మండల స్థాయి ప్రత్యేక అధికారులు స్వయంగా వెళ్ళి మాట్లాడి వారికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి, తిరిగి పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రక్తహీనత ఉన్న విధ్యార్థులు పాఠశాలలో రాగి జావా, మధ్యాహ్న భోజనం, కోడిగుడ్లు ఖచ్చితంగా తీసుకునేలా హెచ్ఎంల ద్వారా కృషి చేయాలన్నారు. నాడు- నేడు ద్వారా పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక సౌకర్యాల పనులు వెంటనే పూర్తి అయ్యేలా చూడాలన్నారు. పేదలందరికీ ఇళ్ళ పథకంలో ఇళ్ల నిర్మాణంపై సమీక్ష చేసి, పలు చేశారు. సమావేశంలో డిఇఒ పి.శైలజ, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, జెడ్పీ సిఇఒ మోహనరావు పాల్గొన్నారు.

గుంటూరు తూర్పులో కమిషనర్, ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగర సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని, సుధీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే ముస్తఫా, కార్పొరేటర్లు, అధికారులతో కలిసి తూర్పు నియోజకవర్గంలోని ప్రధాన అవుట్‌ఫాల్ డ్రైన్, రైల్వే క్రాసింగ్ పాయింట్ అయిన రాజీవ్ గాంధీ నగర్ మొండిగేటు, పాత గుంటూరు మెయిన్ రోడ్డులోని డ్రైన్ కల్వర్ట్, సుద్దపల్లి డొంక రోడ్, పొన్నూరు రోడ్, చంద్రబాబు నాయుడు కాలని తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ప్రధాన అవుట్ ఫాల్ డ్రైన్ మొండిగేటు వద్ద రైల్వే లైన్ క్రాసింగ్ వద్ద పెండింగ్‌లో ఉండటం వల్ల తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయని, త్వరలో సమస్య పరిష్కారానికి రైల్వే ఉన్నతాధికారులతో చర్చిస్తామన్నారు. డ్రైన్ల వల్ల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని, ప్రజలు కూడా వ్యర్థాలను కాల్వల్లో వేయకుండా ఇంటి వద్ద కార్మికులకు ఇవాలని కోరారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలోకి వర్షాలకు మేజర్ డ్రైన్ల ద్వారా మురుగు వస్తుందని, డానికి వెళ్లే మార్గం సరిగా లేకపోవడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కమిషనర్ కి సమస్య వివరించగానే క్షేత్ర స్థాయి పరిశీలనకు వచ్చారని, త్వరలో ఎప్పటి నుండో ఉన్న మురుగు సమస్యకు పరిష్కారం దొరుకుందన్నారు. అలాగే అంతర్గత డ్రైన్ లు కూడా రోజు శుభ్రం చేయించాలని, కార్పొరేటర్లు ప్రతిపాదించిన డ్రైన్ లు, రోడ్లు మంజూరు చేయాలని కోరారు. పర్యటనలో ఎస్.ఈ. భాస్కర్, సిటి ప్లానర్ ప్రదీప్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ డి.రవీంద్ర, ఈ.ఈ. కోటేశ్వరరావు, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, డిప్యూటీ సిటి ప్లానర్ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేతో కలిసి పర్యటిస్తున్న కమిషనర్